నమస్తే తెలంగాణ Telangana Today ఆటో షో కు విచ్చేస్తున్న అతిథులకు ఇవే మా సాదర స్వాగత..సుమాంజలులు..

కరీంనగర్‌లో కార్లు రయ్.. రయ్

- రోడ్లపై మెరుస్తున్న ప్రముఖ కంపెనీల వాహనాలు
- దూసుకెళ్తున్న నయా బైక్‌లు
- పరుగులు తీస్తున్న ఎలక్ట్రిక్ బండ్లు
- ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న వాహనాల సంఖ్య
- అత్యాధునిక మోడళ్లపై ఆసక్తి
- నేడు నగరంలో ఆటో షో

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 22 : మార్కెట్‌లోకి ఏ కొత్త మోడల్ కారు, ద్విచక్ర వాహనం వచ్చినా కరీంనగర్‌లో కనిపించాల్సిందే! నగర రోడ్లపై రయ్.. రయ్.. మంటూ దూసుకెళ్లాల్సిందే! ఎలక్ట్రిక్ వాహనాలు పరుగులు తీయాల్సిందే! కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వాహనాల వినియోగం పెరుగుతున్నది. వాహనం నిత్యావసరంగా మారిన నేపథ్యంలో ప్రజల్లోనూ ఆధునిక బైక్స్, కార్ల మోడల్స్‌పై ఆసక్తి కనిపిస్తున్నది. చేతిలో పూర్తి స్థాయిలో డబ్బు లేకున్నా.. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు లోన్లు ఇస్తుండడంతో రోజురోజుకూ కొనేవారి సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. కంపెనీలు తక్కువ ధరలోనే నయా మోడళ్లను అందుబాటులో ఉంచుతుండడం, ఎప్పటికప్పుడు ఆఫర్లు ప్రకటించడం కూడా కొనుగోళ్లు పెరగడానికి కారణమవుతున్నది. ఇటీవలి కాలంలో మన జిల్లాలో వాహనాల సంఖ్య భారీగా పెరిగినట్లు రవాణా శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్ తర్వాత అత్యధికంగా వాహనాలు ఇక్కడే అమ్ముడవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని 'నమస్తే తెలంగాణ' 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఆటో షో నిర్వహిస్తున్నారు. నేటి ఉదయం 10 గంటలకు ప్రారంభించనుండగా, సందర్శలకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఈ షోలో ప్రపంచ స్థాయిలోని ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఒకే వేదికపై సరికొత్త మోడళ్లను అందుబాటులో ఉంచనున్నాయి. వాహనాలు కొనాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. కార్లు, బైక్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల ఫీచర్ల గురించి, లోన్లు, వడ్డీ రేట్ల గురించి తెలుసుకోవచ్చని, ఈ చాన్స్‌ను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

'పాలాస'లో జాతీయ సదస్సు

సదస్సుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు, వేదికపై శాస్త్రవేత్తలు

జగిత్యాల టౌన్, మార్చి 22 : జగిత్యాల పాలాస వ్యవసాయ కళాశాలలో 'సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై శుక్రవారం ఒక్క రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, హైదరాబాద్ చాప్టర్, పాలాస అగ్రికల్చరల్ కాలేజీ, పీజేటీఎస్‌ఏయూ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించగా, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జీ శ్రీనివాస్ వ్యవసాయంలో క్లైమేట్ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు వివరించారు. సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్ వీ కామక్షి ప్రసాద్ యూసీఈ కంప్యూటింగ్ సిస్టం అడ్వాన్స్, సామాజిక, ఆర్థిక వృద్ధి ప్రభావంపై వివరించారు. సీనియర్ ప్రొఫెసర్, అసోసియేట్ డీన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ డాక్టర్ టీ మాధవరావు కోరుట్లలోని వెటర్నరీ ప్రాక్టిషనర్లకు వ్యవసాయ సహచర, వైల్డ్ యానిమల్ మెడిసిన్, సర్జరీలో అధునాతన పద్ధతులను వివరించారు. ఐఎస్‌సీఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ కే సీతారాంబాబు సైన్స్ ప్రాముఖ్యత, సుస్థిర అభివృద్ధి గురించి ప్రస్తావించారు. ఇందులో జగిత్యాల దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ రాములు, అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ భట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంపత్, ఆర్ సాయికుమార్, టీ ఎల్లాగౌడ్, కే ఝాన్సీరాణి, సైద్నాయిక్ పాల్గొన్నారు.